


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

# (గత సంచిక తరువాయి)

రాను రాను శారద మనసులో కొత్త ఆలోచనలు చోటు చేసుకో సాగాయి. పెద్ద మరిది కృష్ణ చదువులో చాలా చురుకు. తెలివైన వాడు. స్వతంత్ర పోరాటంలో పార్వతీశం ఒక పక్క ఇల్లు పట్టకుండా తిరుగుతున్నా, ఇంట్లో చిన్న, పొన్న పనులన్నీ కృష్ణే చూస్తున్నాడు. బావ వెంట వెంటే తిరుగుతూ పొలం పనులు నేర్చుకుంటున్నాడు ముకుందంతో పాటు. రాజేశ్వరికి, కృష్ణకి ఈడు జోడు కుదురుతుంది. ఆస్తిలో ఆస్తి కలుస్తుంది. హైమవతి కూడా పుట్టింటి సంబంధమంటే కాదనుకుంటుందా? రాజు పెద్దమనిషయ్యేలోగా పెళ్ళి జరిపిస్తే అన్ని విధాలా బాగుంటుంది.

సమయం చూసుకుని తన మనసులోని మాట హైమవతి చెవిన వేసింది శారద. శయనమ్మగారు కూడా అక్కడే ఉన్నారు. హైమవతి మనసులో మాట ఎలా ఉన్నా తొందరగా బైట పడదు. మీ అభిప్రాయం ఏమిటన్నట్లు చూసింది శయనమ్మగారి వైపు. ఆవిడ మోహంలో ఒప్పుకోలు కనిపించింది హైమవతికి.

"వదినా, నీ ఆలోచన మీ అన్నయ్యతో చెప్తాను. వారేమంటారో" అన్నది సాలోచనగా. శారద మనసుకి కొంచెం కష్టం తోచింది. తనీ మాట అనగానే ఆడపడుచు వెంటనే సంబరపడిపోతుందని అనుకుంది శారద. తీరా హైమ భర్తని అడగాలనటంలో ఆవిడ అహం కొంచెం దెబ్బ తిన్నట్లయ్యింది. కళ్ళల్లో నీళ్లు చివుక్కున చిందగా చటుక్కున మొహం రెండో వైపుకి తిప్పుకుంది శారద. అది శయనమ్మ గమనించింది.

"మరేం లేదమ్మా. ఎదురు మేనరిక మవుతుందని అమ్మాయి ఆలోచిస్తున్నట్లుంది. బాబుగారు ఏమంటారో కూడా అడిగితే అయిపోతుంది. నీ చేతిలో పిల్లను పెడితే హైమకు మటుకు ఆనందం కాదూ? పిల్ల కట్టెదుటే ఉంటుంది కదా !" అని సర్దేసింది. శారదకు ఈ మాటలు సాంత్వన నిచ్చాయి. హైమ మనసులోనే శయనమ్మకు దణ్ణం పెట్టింది గండం తప్పించినందుకు.

ఆ రాత్రి భోజనాలయ్యాక పడక గదిలో విశ్రాంతిగా పడుకున్న పార్వతీశంకి చిలకలు చుట్టి నోటికి అందిస్తూ శారద మాటలు చెవిన వేసింది హైమ. ఆయన ఆలోచనలో పడ్డాడు.

"కృష్ణ బుద్ధిమంతుడు. వాడు నా తమ్ముడు. వాడి గుణం మీకు తెలియంది కాదు. అన్నయ్య పోయాక వాడు ఎంత బాధ్యతగా మెలుగుతున్నాడో మనకి తెలుసు కదా. మీరు బయట తిరగటం ఎక్కువైనప్పటి నించి వాడేగా మీ పనులన్నీ కనిపెట్టి అందుకుంటోంది. మీ ఆలోచన దేనికి?" హైమ అడిగింది భర్తను.

"కృష్ణ వయసు తక్కువ. చదువుకుని వృద్ధిలోకి రావలసిన పిల్లవాడు. కనీసం మరో ఏడెనిమిదేళ్లు పడుతుంది వాడి చదువుకి. ఇప్పుడే వాడి పెళ్ళి గోల ఎందుకు? అదీకాక రాజు కన్నా పెద్దది సుశీల. దాని పెళ్ళి గురించి ఆలోచించకుండా రాజు గురించి ఆలోచించటం అన్యాయం. ఇది కుదరదు హైమవతి"

"వదిన మనసు కష్టపెట్టుకుంటుందేమో నండీ. అయినా మీరు మరీనూ, సుశీల పెళ్ళి మన బాధ్యతా ఏమిటీ? అది పిన్నిగారి ఇష్టం. పైగా అది ఒక కొరకరానికొయ్య. ఇంకా చదువుకుంటాను అంటోంది." "

"శారద అర్థం చేసుకోగలదనే అనుకుంటున్నాను, ఇక నువ్వేమిటీ ఇంత విచిత్రంగా మాట్లాడుతున్నావు? సుశీల పెళ్ళి మన బాధ్యత కాక? అదీ మనింట్లో పిల్లే కదా!. శయనమ్మ గారు నీకు పిన్ని అయితే ఆవిడ కూతురు నీ చెల్లెలు కాదా. ఇంత మంచి దానివి, పెద్ద మనసుతో ఆలోచించటం నేర్చుకో" ఇక ఆ ప్రసక్తి ఆపేసినట్లు భార్యను దగ్గరకు తీసుకుని తన గుండెల మీద ఆమె తల ఆన్చుకున్నాడు పార్వతీశం. అతని గుండె చప్పుడు జోలపాట హైమవతికి. రెండు నిమిషాల్లో నిద్రకి ఒరిగింది. శారద నొచ్చుకోకుండా చూడాలి అనుకుంటూ తనూ నిద్రపోయాడు పార్వతీశం.

★★★★★

మర్నాడు పొద్దున్న కాఫీ గ్లాసు పట్టుకుని శారద ఉన్న దగ్గిరకి వచ్చాడు పార్వతీశం. పిల్లలందరినీ కూర్చో పెట్టి చద్దన్నం పెడుతోంది శారద. ముకుందం, మురారి, కృష్ణ, రవి, ప్రసాద్, రాజేశ్వరి, భారతి, శేషు అంత ఆమె చుట్టూ గుండ్రంగా కూర్చుని ఉన్నారు. అందరికి పెరుగన్నంలో మాగాయి కలిపి పెద్ద ముద్దలు చేసి పెడుతోంది శారద. ఆ ముద్దలు ఎంత పెద్దవంటే మిగిలిన వారందరికీ తలో ముద్ద పెట్టి వచ్చేవేళ్టికి మొదటి వారు వాళ్ళ ముద్దపూర్తి చెయ్యగలరు. మొదటి ముద్ద ముందు నాడు మిగిలిన ఏ పచ్చడో పెట్టాక, రెండవ ముద్ద పెరుగన్నం. అంతటితో సరి. అందరి భోజనాలు ఒక్కసారే ముగుస్తాయి. పిల్లలంతా గోదుమంటూ లేచి మిగిలిన పనులు ముగించుకుని బడికి తయారవుతారు. వాళ్ళు మధ్యాహ్నం ఇంటికి వచ్చే వేళ్టికి ఆ పూట వండినవి భోజనంలోకి సిద్ధంగా ఉంటాయి. ఏదైనా అన్నం కడుపు నింపేందుకే తప్ప ఆర్భాటానికి కాదు. ఈ రోజుల్లా ఓక్కొక్కళ్ళకీ ఒక్కొక్కరకం పెట్టటంకాదు. పిల్లలందరూ అన్నీ తినాలి. సరిగ్గా చెప్పాలంటే ఏది పెడితే అది తిన్నాలి.

"శారదా, ఆ పని అయ్యేక కాస్త ముందుగది లోకి రా తల్లీ." అన్నాడు పార్వతీశం. శారద అది దేనికో ఊహించింది. పిల్లలందరూ అన్నాలు ముగించి పెరట్లో అరటి చెట్టు దగ్గర చేతులు కడుక్కోవటానికి వెళ్ళారు. ఆడపిల్ల లిద్దరికి ఆడపడుచు కొబ్బరినూనె రాసి జడలు వేశాక వాళ్లకి తిలకంతో బొట్టు, కాటుక దిద్ది, చాకటింటి బట్టలు కట్టించి రాజుని మిగిలిన మగపిల్లలతో బడికి పంపి, భారతిని ఆడుకొమ్మని బొమ్మలు ముందేసి సుశీలను కాస్త చూసుకుంటూ ఉండమని చెప్పి వచ్చింది శారద. కొంగు భుజాల నిండా కప్పుకుని పార్వతీశం ఉన్న గది గుమ్మంలో నిల్చుంది.

"హైమ రాజు విషయంలో నువ్వేమనుకుంటున్నావో చెప్పింది. కానీ కృష్ణ ఇంకా పసివాడు. వాడి పెళ్ళికి చాలా సమయముంది కదా. ఇప్పుడే ఈ మాటలు నా కిష్టం లేదు. పైగా సుశీల ఒకత్తి ఉంది కదా పెద్దది. ఏమంటావు?"

"ఏమనగలను అన్నయ్యా? నీ ఇష్టం. నా మనసులో అభిప్రాయం వదినతో చెప్పాను. నేనేమంటానిక? మొదటినించి ఆ కుటుంబానికైనా, ఈ కుటుంబానికైనా పెద్ద దిక్కు నీవే, నీ ఇష్టం." శారద గొంతులో నిష్ఠురం పార్వతీశం గమనించక పోలేదు. కానీ ఆయన అంత తొందరగా నిర్ణయాలు మార్చుకునే రకం కాదు. మంచి అని తోచింది మటుకే చేస్తాడు

నిశ్శబ్దంగా లోపలికి వెళ్ళిపోయింది శారద. కానీ ఆమె మనసులో ఎన్ని కల్లోల సాగరాలో.

సాయంత్రం చల్లబడ్డ వేళ పిల్ల లందరు శయనమ్మగారి అందరిల్లుకి చేరతారు ఆటల కోసం. ఆమె వారి చేత రకరకాల ఆటలు ఆడిస్తుంటుంది. ఆ రోజు మాయావుడుం ఆడుతున్నారు అంతా. వరండా ముందరి మెట్ల మీద శయనమ్మ కూర్చుని చూస్తుండగా ముందుగా సుశీల పంటలేయించింది అందరి చేతా. అందులో మురారి దొంగయ్యాడు. మిగిలిన పిల్లలు దాక్కుంటే వాడు, వాళ్ళెక్కడ దాక్కున్నారో కనిపెట్టాలి. మురారి కళ్ళని తన అరచేతులతో మూసి సుశీల

"దాగుడు మూత దండాకోర్

పిల్లి వచ్చే ఎలుకా భాగ్

ఎక్కడి దొంగలు అక్కడే

సాంబార్ బుడ్డి గప్ చుప్, " అని పాడింది

ఆ పాట అయ్యేలోగా అందరు పిల్లలు రకరకాల చోట్లలో దాక్కున్నారు. మురారి అందర్నీ కనుక్కోవాలి. అతని చేతికి అందకుండా ఎవరు వచ్చి సుశీలను తాకితే వారు పండై పోతారు. అంటే ఇంక దొంగ అవ్వరన్నమాట. "అందరిల్లు"పిల్లలే కాక బయట పిల్లలందరూ చేరుతారు ఈ ఆటకి. వాళ్లంతా గోలగోలగా ఆడుతుండగా పార్వతీశం అక్కడికి వచ్చాడు. తిన్నగా వెళ్ళి శయనమ్మ గారి పక్కన కూర్చుంటూ

"ఏవమ్మా, ముసలమ్మా గారూ! ఏంటీ తిన్నగా ఉండక ఏవో పెళ్ళి మాటలు ఎత్తారుట ఇంట్లో ఆడవాళ్ళూ" ఏదన్నా కొంచెం ఆలోచించాల్సి వస్తే ఆమెను కదులుస్తాడు పార్వతీశం. శయనమ్మ గ్రహించింది పార్వతీశం మనసులో మాట

"ఔను బాబూ. మన రాజుకి పెళ్ళి చేస్తారేమో అని. అదే శారదమ్మ కృష్ణకైతే బాగుంటుందని అంటోంది."

“కానీ పెద్ద పిల్ల సుశీల సంగతి చూడాలిగా ముందు. అయినా కృష్ణ ఇంకా స్థిరపడటానికి ఏడెనిమిదేళ్లు పడుతుంది. ఇప్పట్లో పెళ్ళి ఆలోచించలేము కదా."

"ఆ మాటా నిజమే. కానీ సుశీల పెళ్ళి మాట ఎత్తితేనే ఖస్సు మంటోంది కదా. అదీ గాక రాజు విషయంలో ఇప్పుడు ఓ మాటనుకుంటే సరి. పెళ్ళి ఇప్పుడు చెయ్యట్లేదుగా. అనుకున్నప్పుడు, అయిన సంబంధం దొరుకుతుందా బాబూ? శారదమ్మ ఇంట్లో పిల్లనిస్తే మీ కళ్ళముందేగా ఉండేది. మంచి చెడు చూసుకుంటూ ఉండొచ్చు.” నచ్చచెప్పింది శయనమ్మ.

"మీరు అన్నదీ నిజమే కావచ్చు కానీ, ఇప్పుడీ పెళ్ళి అన్న మాట పిల్లల ముందంటే వాళ్లకి చదువు ధ్యాస పోతుంది. పైగా బాల్యవివాహాలు వద్దని అందరు అంటున్నారు. అందునా మనం స్వతంత్ర ఉద్యమంలో ఉన్నాం.. సాటివారికి ఆదర్శంగా ఉండాలి," సూటిగా అన్నాడు పార్వతీశం.

"ఈ మాటే శారదమ్మ తో అంటే ఆమె మనసు కష్టపెట్టుకోదు కదా," సలహా చెప్పింది శయనమ్మ. సరేనన్నట్లు తలాడించాడు పార్వతీశం.” పిల్లకి చట్టప్రకారం పెళ్ళి వయసు వచ్చాక పరిస్థితిని బట్టి చూడవచ్చు. నందో రాజా భవిష్యతి” ఇదేదో బాగానే ఉందనిపించింది పార్వతీశంకి. కర్రా విరగదు, పామూ చావదు.

రోజూ రాత్రి భోజనాలయ్యాక వేసవి కాలమైతే ఎక్కువ భాగం ఇంటి బయట ఉన్న వేప చెట్టుకింద నులక మంచాలు వేసుకుని నిద్ర పట్టే వరకూ కబుర్లు చెప్పుకుంటారు అందరూ. పిల్లలు అందరూ ఒక దగ్గిర పడుకుంటే, పెద్దవాళ్ళు కాస్త దూరంగా మరో దగ్గిర. శయనమ్మ గారు కూడా వాళ్ళతో పాటే చేరుతుంది పడుకోటానికి. అందరి ఇళ్ళూ ఒక ఆవరణలోనే కదా. సుశీల మటుకు సాధారణంగా అందరింట్లోనే ఉంటుంది అక్కడి వారికి తోడుగా. పిల్లలు నెల పరీక్షల ముందు ఆమె దగ్గరకు చేరుతారు చదువుకోవటానికి. పెద్దవాళ్ళు లోకాభిరామాయణం మాట్లాడుకుంటుంటే, పిల్లలు బడి కబుర్లు, కథలు చెప్పుకుంటూ ఆకాశం దుప్పటి కింద పడుకుంటారు, నక్షత్రాలు లెక్క పెడుతూ. ఆ రోజు రాత్రి అలాగే పడుకున్నారు. పిల్లలందరూ నిద్రపోయాక పార్వతీశం

"అమ్మా శారదా!" అని అనునయంగా పిలిచాడు.

"చెప్పండి అన్నయ్యా" అన్నది శారద లేచి కూర్చుంటూ. హైమావతి కదిలింది తానూ మేలుకుని ఉన్నానన్నట్లు.

"నువ్వు వదినతో మాట్లాడిన విషయం ఆలోచించానమ్మా. పిల్లలిద్దరూ ఇంకా చిన్న వాళ్ళు. మనం ఒక మాట అనుకుందాం. కానీ వాళ్ళ దగ్గర పెళ్ళి మాటలు ఎత్తొద్దు. సమయం వచ్చినప్పుడు వాళ్ళిద్దరికీ పెళ్ళి చేద్దాం. ఇది నీకు నా వాగ్దానం అనుకో."

శారద మొహం వెలిగిపోయింది సంతోషంతో.

★★★★★

రవీంద్ర నాథ్ ఠాగూర్, బకించంద్ర ఛటర్జీ, సుబ్రహ్మణ్య భారతి,కాజి నాజ్రుల్ ఇస్లాం వంటి వారు కవితల ద్వారా, వారి ప్రసంగాల ద్వారా భారతీయులలో జాతీయతా భావాన్ని పెంపొందించటానికి కృషి చేస్తున్నారు.సరోజినీ నాయుడు వంటి మహిళలు స్వాతంత్రోద్యమంలో పాల్గొనటం మొదలు పెట్టటం మరెందరో స్త్రీలు పోరాటంలోకి రావటానికి దారి చూపింది.

భారతీయుల అంగీకారంతో పనిలేకుండా బ్రిటిష్ ప్రభుత్వం రెండో ప్రపంచ యుద్ధంలో భారతదేశం పాల్గొంటుందని ప్రకటించటంతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులందరూ నిరసనగా వారి పదవులకు రాజీనామాలు చేశారు.

రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతుండగానే 1942 లోగాంధీ గారు "క్విట్ ఇండియా" ఉద్యమాన్ని మొదలు పెట్టాడు. బ్రిటిష్ వారు దేశాన్ని వదిలి పోవలసిందే అని మొదలు పెట్టిన ఆ ఉద్యమం వలన ఆగ్రహించిన బ్రిటిష్ వారు భారతీయ కాంగ్రెస్ సభ్యులందరినీ అరెస్టు చేశారు. దానికి నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగాయి. చివరికి రెండో ప్రపంచ యుద్ధం ముగియటానికి ముందే బ్రిటిష్ వారు భారతదేశానికి పాలనాధికారాన్ని ఇవ్వడానికి అంగీకరించారు. ఫలితంగా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని నిలుపు చేయటంతో బందీలుగా ఉన్న వేల మంది భారతీయులకు విడుదల లభించింది. జైలుకి వెళ్ళిన పార్వతీశం ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చాడు.

రెండవ ప్రపంచ యుద్ధం పంతొమ్మిది వందల నలభై అయిదులో ముగిసింది. ఈలోగా బెంగాల్ లో వచ్చిన కరువుకి దగ్గర దగ్గర ముప్ఫయి లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో దేశంలోని ఇతర ప్రాంతాలవారు మానవత్వంతో స్పందించి వారికి ఆహార సరఫరా చేశారే కానీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అత్యవసర ఆహార సహాయాన్ని అందించనే లేదు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా రాజకీయంగా ఎన్నో మార్పులకు ఇది దారి తీసింది. ఆరు కోట్ల నుండి ఎనిమిది కోట్ల మంది మరణించిన ఈ యుద్ధం వలన ఎన్నో కోట్ల మంది తమ ఆస్తులను కోల్పోయారు. ప్రపంచంలో అమెరికా, రష్యా శక్తివంతమైన దేశాలుగా ఆవిర్భవించాయి.

స్వాతంత్ర్య పోరాటం పల్లె పల్లె, వీధి వీధికి పాకి బ్రిటిష్ వారికి భారతదేశాన్ని విడిచిపోక తప్పని పరిస్థితి రావటంతో చివరికి 1947 భారతదేశ స్వాతంత్ర్య చట్టం చేయబడింది. కోట్లాది భారతీయుల పోరాట ఫలితంగా, లక్షలాది మంది జైళ్ళల్లో మగ్గి, దెబ్బలు తిని కూడా అహింసా మార్గంలో సలిపిన పోరాటాల ఫలితంగా, వేలాది మంది ఆయుధ

పోరాటం, అహింసాయుత పోరాటం సల్పిన వారి ప్రాణ త్యాగాల ఫలితంగా, వందల సంవత్సరాలు బ్రిటిష్ పాలన కింద ఉన్న భారత మాత 1947 ఆగష్టు 15న స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంది.

★★★★★

22

ఆ రోజు, స్వాతంత్ర్యమే లక్ష్యంగా ఉద్యమించిన కోట్లాది భారతీయుల కోరిక నిజమైన రోజు! 1947 ఆగష్టు 14 వ తేదీ అర్ధరాతి. జవహర్లాల్ నెహ్రు జాతినుద్దేశించి, తదనంతర కాలంలో 20వ శతాబ్దానికే అత్యుత్తమమైందిగా ప్రసిద్ధి పొందిన "ట్రిస్ట్ విత్ డెస్టినీ "ప్రసంగం ఇచ్చారు. అది ఆల్ ఇండియా రేడియో లో ప్రసారమయినప్పుడు భారత దేశ ప్రజానీకం యావత్తూ వారి రేడియోలకు అతుక్కుపోయారు. వారి హృదయాలు ఉద్వేగంతో ఊగిపోయాయి. గర్వంతో పరవళ్లు తొక్కాయి. దేశభక్తితో ఉప్పొంగి పోయాయి. బ్రిటిష్ వారి యూనియన్ జాక్ పతాకం దిగి ఢిల్లీ ఎర్రకోట మీద మువ్వన్నెల జాతీయ జెండా మొదటి సారి ఎగిరింది. ఇది భారతదేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో వ్రాయబడిన సమయం. ఆ క్షణాలను ఆకాశవాణి స్వరబద్ధం చేసింది. ఆగస్ట్ పదిహేనున టంగుటూరి సూర్యకుమారి, బాలాంత్రపు రజనీకాంతరావు గారు వంటి వారు జాతీయ గీతాలు పాడారు.

"ఎత్తవోయి నీ ప్రియ జండా" వంటి దేశభక్తి గీతాలు దేశమంతటా ప్రసారమయ్యాయి. బ్రిటిష్ వారి నుండి పాలనాధికారం భారతీయులకు బదిలీ అయ్యింది. భారత జాతి యావత్తు ఊపిరితిత్తుల నిండా స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. దేశం కోసం అసువులు బాసిన లక్షలాది భారతీయులు దేవతలతో సమానంగా పూజింప బడ్డారు. స్వతంత్రంకోసం తపించిపోయిన భారతీయుల ఇళ్లన్నీ మువ్వన్నెల జండాలతో రెపరెపలాడాయి. జాతీయజండా ప్రతి ఒక్కరి ఇంటినే కాదు ఒంటిని కూడా కూడా అలంకరించిన క్షణాలవి. స్వంతత్ర భారతదేశం లో ప్రసారం చేయబడిన తొలిగీతం

"మాదీ స్వాతంత్ర్య దేశం, మాదీ స్వాతంత్ర్య జాతీ".ఈ గీతం భారతీయులందరి ఏకాత్మ గళంతో రజనీకాంతరావు గారు రచించగా సూర్యకుమారి గారి గొంతుతో కొన్నాళ్ళపాటు మారుమ్రోగిపోయింది.

దేశప్రజలందరూ నెహ్రూ గారి ప్రసంగం ముగిసిన వెంటనే వీధుల్లోకి పరుగులు తీస్తూ వచ్చారు, మిఠాయిలు పంచుకున్నారు. ముసలి, ముతక, పెద్ద, చిన్న, ఆడ, మగ వంటి భేదాలు ఏవి లేకుండా భారతీయులు ప్రతిఒక్కరు స్వాతంత్ర్య సాధనను ఒక పండుగలాగానే జరుపుకున్నారు. వీధుల కూడళ్ళలో నృత్యాలు చేశారు భారతి, రాజేశ్వరి, సుశీల, ముకుందం, మురారి, కృష్ణ, రవి, ప్రసాద్, శేషు. చివరికి హైమవతి, శారదా, శయనమ్మ కూడా ఆ సంబరంలో

పాలు పంచుకున్నారు. అందరూ కలిసి పార్వతీశంని కూడా లాక్కొచ్చారు. భారతి, శేషు అందరికంటే ఎక్కువ ఆడారు. పాడారు. అందరిలో అదో ఉద్వేగం, అదో ఆనందం, అదో గర్వం. పరిచయం ఉన్నవారికి, లేనివారికి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఒకరిని ఒకరు అభినందించుకున్నారు బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంచుకున్నారు. ఆ రోజుకీ, ఈ రోజుకీ ఆగష్టు 15 ప్రపంచంలో ఏ మూల ఉన్నా, భారతీయు లందరికీ పండుగ దినమే.

పీల్చే గాలే మారిపోయిందా అనిపించింది ఆ స్వేచ్ఛా వాయువులు పీల్చిన భారతీయులందరికీ. అదో అపూర్వమైన అనుభవం. అందరూ ఒకరినొకరు కౌగలించుకుని జై భారత్ అని ఎలుగెత్తి అరిచారు. భారతదేశ మువ్వన్నెల జండా మురిసి పోయిన రోజది. ఆ సంబరాన్ని వర్ణించటానికి మాటలు చాలవు. బానిసత్వంలో మగ్గిన నాటి భారతీయులకే కష్టపడి సాధించుకున్న ఆ స్వతంత్రానికి ఉన్న విలువ తెలుసు. ఒప్పుకోవటానికి కష్టంగా ఉన్నా ఇప్పటి తరంలో ఆ విలువ ఒక్క సైనికులకే తెలుసేమో!

"నేషన్ వేక్స్ టు న్యూ లైఫ్" అని టైమ్స్ అఫ్ ఇండియా ప్రచురించింది. పేపర్ మొదటి పేజీలలో ఢిల్లీ వంటి ప్రదేశాలలో జరిగిన సంబరాలను చూపించే ఛాయాచిత్రాలను ప్రచురించారు. అప్పటికింకా బ్రిటిష్ పరిపాలన కింద ఉన్న ఎన్నో ఇతర దేశాలకు భారత దేశపు స్వాతంత్ర్యము ఆశా భావాన్ని రేకెత్తించింది.

ఆనాడు ప్రతి భారతీయుడి మొహం ఏదో సాధించినట్లు గర్వంతో వెలిగిపోతోంది. ఆకాశంలో దేశం నలుమూలలా రెపరెపలాడుతున్న మువ్వన్నెల జెండాలు నింగికే కొత్త అందాన్నిచ్చాయి. ప్రతి వారు పండుగలాగా పిండి వంటలు చేసుకుని పంచి పెట్టుకున్నారు. అది సామాన్యమైన విజయం కాదు కదా. చిరకాల దాస్య విముక్తి. అందరు స్వాతంత్ర్య సంగ్రామం లో వారి వారి అనుభవాలను అందరితో పంచుకున్నారు. భారత దేశం ఒక స్వాతంత్ర్య దేశంగా అవతరించిన ఆ ఆగష్టు 15,1947న పార్వతీశం ఇంట్లో ఒక మరచిపోలేని సంఘటన జరిగింది. అది సుశీలకు సంబంధించినది. జీవితం పట్ల ఆమె ఆలోచనలను సమూలంగా మార్చివేసింది.

★★★★★

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS